# స్వభావం

— పోణంగిపల్లి నాగభూషణం



"ఎక్కడికి బయలుదేరావు?" దార్లో కనిపించిన రమని అడిగింది ఉమ.

"ఎక్కడికీ లేదు ఇంటికే వెళ్తున్నాను."

"అయితే పద అలా గుడిదాకా వెళ్ళి వద్దాం" అంది ఉమ.

"సరే పదు. నాకూ అర్జంటు పనేం లేదు" అంటూ ఉమని అనుసరించింది రమ.

రమ ఉమ కలిసి నడుచుకుంటూ గుడికి బయలుదేరారు. రమ ఎప్పుడో కాని గుడికి వెళ్ళదు. కళ్ళు మూసుకుని దేవుడికి దణ్ణం పెట్టుకున్నా గుడిలో రమకి ఏకాగ్రత కుదరదు. చుట్టూ వున్న భక్తుల్ని నిశితంగా గమనించడమే సరిపోతుంది తనకి. పక్కనున్నావిడ ఎటువంటి చీర కట్టుకుంది, వాళ్ళావిడ హారతి పళ్ళెంలో రూపాయి వేయబోతే అంతెందుకు పావలా చాలు అన్నట్లుండే ఆవిడ చూపులు, వాటిమీదే వుంటుంది రమ ధ్యానంతా.

పళ్ళెంలో వేసిన దక్షిణ, ఆవిడ బయటికి కన్పించే నగలు, బట్టల స్టేటస్‌కి అనుగుణంగా వుందా! లేదా! అన్న మీమాంస.

అర్చకుడు ఓ కన్ను హారతి పళ్ళెంలోని డబ్బులమీద, మరో కన్ను దేవుడి మీద వుంచి పూజలు చేయడం.

దక్షిణ భారీగా వేసిన భక్తునికి చక్కగా శఠగోపం పెట్టి వినయంగా ప్రసాదం ఉదారంగా ఇవ్వడం. దక్షిణ వేయని వాడికి అన్యమనస్కంగా అంటీముట్టనట్టు శఠగోపం పెట్టి, ప్రసాదం చిరాగ్గా విదల్చడం.

ఇలా ఒకదాని కొకటి సంబంధం లేని ప్రాపంచిక విషయాల మీదకి పోతుంది తన మనసు. దేవుడిమీద ఉండదు, గుడికి వస్తే. అందుకే తను ఇంట్లోనే దేవుడికి దణ్ణం పెట్టుకుంటుంది అంటూ తన మనసుని సమాధాన పరచుకుంది రమ. తమ ఎంత ఎక్కువగా గుడికి వస్తావో అని చెప్తున్న ఉమ మాటలు వింటూ.

ఇద్దరూ కాళ్ళు కడుక్కుని గుడిలో కెళ్ళారు. మూడుసార్లు గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి, గుడిలోని గంటలు కొట్టి దేవుడికి దణ్ణం పెట్టుకున్నారు భక్తిగా కనులు మూసుకుని.

అర్చకుడు ఇచ్చిన హారతి కళ్ళకద్దుకుని, రమ పళ్ళెంలో రూపాయి వేసింది. ఉమ పావలా కాసు వేసింది. తీర్థ ప్రసాదాలు పుచ్చుకుని ఇద్దరూ బయటకొచ్చారు. శాస్త్ర ప్రకారం ఇద్దరూ గుడి ఆవరణలో కాసేపు కూచుని ఇంటికి వెళ్దామని ఇద్దరూ లేచారు.

గుడి బయట వున్న ఆరుగురు బిచ్చగాళ్ళకి అందరికీ తలో అర్థరూపాయి వేసింది ఉమ. గుడిలో పావలాతో సరిపెట్టి బయట ఇంత దయ చూపడం రమకి ఆశ్చర్యం కలిగించింది. రమ ఆశ్చర్యాన్ని అర్థం చేసుకున్నట్లు ఉమ "గుడిలో డబ్బులు చాలామందే వేస్తారు. కాని బిచ్చగాళ్ళకి అందరూ వేయరు. అందుకే నేను విధిగా ఇక్కడ వున్న వారందరికీ డబ్బులు ఇస్తాను" అంది. "మానవ సేవే మాధవసేవ అన్న సూక్తిమీద నాకు అపారమైన విశ్వాసం. అందుకే తరచు గుడికొచ్చి ఇలా అందరికీ డబ్బులిస్తాను" కళ్ళు తిప్పుకుంటూ గొప్పగా అంది ఉమ.

"కాళ్ళు పీకుతున్నాయే. ఇంటికి నడిచి వెళ్ళలేం కాని రిక్షాలో పోదాం" అంటూ ఉమ రిక్షాని పిలిచింది. వంగిపోయి ఎముకల గూడులా వున్న రిక్షావాడు అయిదు రూపాయిలు అడిగితే గీచి గీచి బేరమాడి రెండు రూపాయిలు ఇస్తానంది ఉమ. ఆ డబ్బులు కూడా దక్కవేమోనన్నట్లు గత్యంతరంలేక ఒప్పుకున్నాడు రిక్షావాడు రెండు రూపాయల బేరానికి.

జానెడు పొట్టలో రగిలే ఆకలి మంటలు ఆర్పుకోడానికి శరీరంలోని రక్తాన్ని ఆవిరి చేసుకుంటూ వీరిద్దర్నీ లాగలేక లాగలేక రిక్షా తొక్కుతూ చెమటలు కక్కుకుంటున్న రిక్షా అబ్బీ మనిషే. మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తి ఉమకి రిక్షా బేరం ఆడేటప్పుడు గుర్తుకు రాలేదు. ఇప్పుడూ గుర్తుకు రాలేదు. గుడిలో భక్తులందర్నీ అంత నిశితంగా గమనించిన రమకి రిక్షా వాడి కష్టం కన్పించలేదు. వాళ్ళిద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఇళ్ళకి చేరుకున్నారు, రిక్షావాడు వాళ్ళిచ్చిన రెండు రూపాయల కాగితం చెమటకి తడవకుండా చూడ్డానికి అవస్థపడుతూంటే!